సాక్షి
అనకాపల్లి
సోమవారం । 30 । అక్టోబర్ । 2023



వేడుకగా బృందగాన పోటీలు
అనకాపల్లిలో భారత వికాస పరిషత్ ప్రాంత స్థాయి జాతీయ బృందగాన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 8లో



అయ్యప్పలకు అన్నపూర్ణగా..
వందలాది మంది అయ్యప్ప భక్తులకు ఏటా కార్తీక మాసంలో పైల సన్యాసమ్మ నిత్యాన్న దాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 8లో



ఉత్సాహంగా ఫుట్‌బాల్ మ్యాచ్
జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యలమంచిలిలో నిర్వహించిన ఎగ్జిబిషన్ మ్యాచ్ ఉత్సాహంగా జరిగింది. 8లో

న్యూస్‌రీల్

280 మంది ఉపాధ్యాయులు సర్దుబాటు

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలో 280 మంది ఉపాధ్యాయులకు వేర్వేరు పాఠశాలల్లో సర్దుబాటు చేస్తూ డీఈవో ఎల్.చంద్రకళ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో గల పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులుగా గుర్తించిన వారిని, అవసరమైన చోట్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద విధులు కేటాయించారు. వీరిలో స్కూల్ అసిస్టెంట్ బయాలజీ-18, ఇంగ్లిష్-20, హిందీ-7, గణితం-44, ఫిజికల్ సైన్స్-33, సోషల్ సైన్స్-21, తెలుగు-27 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అదే విధంగా 110 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను సైతం అర్హత మేరకు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. ఉత్తర్వుల్లో పేర్కొన్న ఉపాధ్యాయులంతా కేటాయించిన పాఠశాలల్లో వెంటనే రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

మంచాలలో సినిమా షూటింగ్ సందడి



షూటింగ్‌లో పాల్గొన్న నటీనటులు

మాడుగులరూరల్: చీడికాడ మండలం మంచాల గ్రామంలో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. రామయోగి గెలాక్సీ ప్రొడక్షన్స్ నంబరు-1 పతాకంపై నిర్మిస్తున్న సినిమా కోసం పలు సన్నివేశాలు చిత్రీకరించారు. హీరో, హీరోయిన్లుగా సాయికిరణ్, సాయి సంహిత్, ఇతర పాత్రల్లో సోమిరెడ్డి, రాజీవ్, జబర్దస్త్ టీమ్, ఓనమ్ అప్పి, ఎఫ్‌ఎం బాబాయి, సత్తిపండు, శృతి, జోత్స్న, శ్రీను నటిస్తున్నారు. ఆడారి మూర్తిసాయి దర్శకత్వంలో నిర్మాతగా ఎం.ఎస్.ఆర్.మూర్తి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పి.సతీష్‌కుమార్ సంగీతం సమకూరుస్తుండగా, కెమెరామెన్‌గా ఆర్‌కే వ్యవహరిస్తున్నారు. ఎడిటింగ్ బాధ్యతలు జేపీ నిర్వహిస్తున్నారు. స్థానిక నటులు గండి గోపి, మహేష్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలను అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఇది వరకే చిత్రీకరించినట్టు దర్శకుడు మూర్తి సాయి తెలిపారు. మరో వారం రోజుల పాటు మంచాల, చుట్టు పక్కల గ్రామాల్లో షూటింగ్ ఉంటుందని ఆయన తెలిపారు.

సరుగుడు జలపాతం వద్ద సండే సందడి



జలపాతం వద్ద సందర్శకుల కేరింతలు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. గతంలో కార్తీక మాసం ప్రారంభం నుంచి జలపాతం వద్ద సందర్శకుల తాకిడి కనిపించేది. ఈ ఏడాది ప్రతి ఆదివారం ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల నలుమూలల నుంచి పర్యాటకులు వస్తున్నారు. ఇక్కడి ఎత్తైన రెండు కొండల మధ్య నుంచి ప్రవహించే జలపాతం సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జలపాతంలో జలకాలాడుతూ పర్యాటకులు సందడి చేశారు. కొంత మంది తాండవ రిజర్వాయరు అందాలను తిలకించేందుకు బయలుదేరారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లుగా
చక్కెర ఫ్యాక్టరీలు

- మూతపడిన కర్మాగారాలను వినియోగంలోకి తెచ్చే దిశగా ప్రభుత్వం యోచన
- ఇప్పటికే నివేదిక ఇచ్చిన మంత్రుల సబ్ కమిటీ
- జిల్లాలో గోవాడ మినహా మిగతా ఫ్యాక్టరీల్లో యూనిట్ల ఏర్పాటుకు యోచన
- బెల్లంతోపాటు ఇతర ఆహార ఉత్పత్తుల తయారీ
- చెరకు రైతులకు ఊరట ఇవ్వనున్న ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలు



ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీ

చోడవరం: రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం యోచిస్తోంది. దీనికి సంబంధించి ప్రభుత్వం నియమించిన మంత్రుల ఉప సంఘం ఇప్పటికే ఒక నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. గత కొన్నేళ్లుగా తీవ్ర సంక్షోభంలో చిక్కుకుని మూతబడిన చక్కెర పరిశ్రమను ప్రత్యామ్నాయ పరిశ్రమగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటి వరకు పంచదారను తయారు చేసిన సుగర్ ఫ్యాక్టరీలు రానున్న రోజుల్లో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లుగా మారనున్నాయి. ఈ ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే మంత్రుల సబ్ కమిటీ ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చింది. రాష్ట్రంలో గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల కొన్నేళ్లుగా చక్కెర ఫ్యాక్టరీలు తీవ్ర నష్టాల్లో చిక్కుకోగా టీడీపీ ప్రభుత్వ హయాంలో అవి మరింత సంక్షోభంలోకి వెళ్లాయి. అప్పట్లోనే ఫ్యాక్టరీలను అమ్మేసేందుకు నోటిఫై కూడా చేశారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆ ప్రక్రియను నిలిపివేసి చెరకుకు భారీగా మద్దతు ధర ఇవ్వడంతోపాటు ఫ్యాక్టరీలకు నిధులు ఇచ్చి తిరిగి నడిచేలా చేశారు. ఆయన మరణానంతరం అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రులు, తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం మళ్లీ సుగర్ ఫ్యాక్టరీలను నిర్లక్ష్యంగా వదిలేశాయి. దీంతో ఫ్యాక్టరీలు పూర్తిగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయి.

రాష్ట్రంలో 10 సహకార చక్కెర కర్మాగారాలు ఉండగా వాటిలో ఆరు ఫ్యాక్టరీలను గత ప్రభుత్వ హయాంలోనే మూసేశారు. నష్టాల్లో ఉన్నా గోవాడ (చోడవరం), తాండవ, ఏటికొప్పాక, భీమసింగి ఫ్యాక్టరీలు మాత్రమే క్రషింగ్ చేసేవి.

చెరకు సాగు విస్తీర్ణం సగానికి పైగా తగ్గిపోవడంతో గోవాడ మినహా మిగతా మూడు ఫ్యాక్టరీలు గత మూడు సీజన్ల నుంచి క్రషింగ్ చేయలేదు. రైతుల చెరకు బకాయిల వరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇచ్చినప్పటికీ పూర్తిగా నష్టాల్లో కూరుకుపోయిన మూడు ఫ్యాక్టరీలను నడపలేని పరిస్థితి ఏర్పడింది. గోవాడ ఫ్యాక్టరీ మాత్రం ప్రభుత్వ సహకారంతో నిలబడింది. అయితే పంచదార ఉత్పత్తి ఖరీదు ఎక్కువై, మార్కెట్‌లో ధర తక్కువగా ఉండటం వల్ల ఈ ఫ్యాక్టరీ కూడా దినదిన గండంగానే నడుస్తోంది.

డిమాండ్ మేరకు బెల్లం, ఆహార ఉత్పత్తుల తయారీ

రాష్ట్రంలో మూతబడిన చక్కెర పరిశ్రమలను ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలుగా మార్చే ప్రతిపాదనపై ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఫ్యాక్టరీలపై అధ్యయనం చేసేందుకు వేసిన మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం ఆ దిశగా ప్రభుత్వం యోచన చేస్తోంది. ఫ్యాక్టరీల ఆస్తులను కాపాడడంతోపాటు ఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఉపాధి కూడా కల్పించినట్టు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

అనకాపల్లి, భీమసింగి, ఏటికొప్పాక, తాండవ ఫ్యాక్టరీలను మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి బెల్లం, ఆహార ఉత్పత్తుల తయారీ కేంద్రాలుగా మారిస్తే బాగుంటుందనే అభిప్రాయంలో ప్రభుత్వం ఉంది. అంతర్జాతీయ బెల్లం మార్కెట్ కూడా వీటికి సమీపంలో అనకాపల్లిలోనే ఉండడంతో ఈ పరిశ్రమ బాగుంటుందనే అభిప్రాయం మంత్రుల కమిటీ వ్యక్తం చేయడం, ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా ఉండడంతో ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదన కార్యరూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది. వీటి నిర్వహణ అంశంపై కసరత్తు కూడా ప్రభుత్వం ప్రారంభించింది. ఇదే జరిగితే జిల్లాలో మూతపడిన సుగర్ ఫ్యాక్టరీలన్నీ ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలుగా మారి, ఈ ప్రాంతంలో కొత్త పరిశ్రమకు తెర తీయడంతో పాటు చెరకు రైతులకు కొండంత అండగా నిలిచే అవకాశం ఉంది.

ఫ్యాక్టరీలను కాపాడేందుకే..



మూతపడిన సహకార చక్కెర కర్మాగారాలను కాపాడేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లుగా మార్చాలని యోచిస్తున్నాం. దీనిపై ముఖ్యమంత్రికి ఒక నివేదిక ఇచ్చాం. పరిశ్రమలను ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేస్తే వాటిని పరిరక్షించడంతోపాటు కొందరికి ఉపాధి అవకాశాలు కూడా కల్పించినట్టు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. రైతులు, కార్మికులతోపాటు అదనంగా మరికొంతమందికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి వీలు కలుగుతుంది.

–గుడివాడ అమర్‌నాథ్,
రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి

తెరుచుకున్న ఆలయాలు

గ్రహణ శుద్ధి అనంతరం పూజలు, దర్శనాలు



చోడవరం శ్రీస్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో సంప్రోక్షణ అనంతరం పూజలు



ఉపమాక ఆలయంలో సంప్రోక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి/చోడవరం: చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం మూతపడిన ఆలయాలు ఆదివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం తెరుచుకున్నాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం ఆలయాన్ని శుద్ధి చేశారు. కొండపై మూలవిరాట్ సన్నిధి, దిగువన ఉత్సవమూర్తుల ఆలయం, ఆండాళ్లమ్మ వారి సన్నిధి, క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామివారి గర్భాలయాలను సంప్రోక్షణ చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించినట్టు ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. అనకాపల్లిలో నూకాంబిక ఆలయంలో సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శన కల్పించారు. చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంతోపాటు అన్ని దేవాలయాలు తెరిచి యథావిధిగా పూజలు నిర్వహించారు. స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించినట్లు ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు తెలిపారు.

మద్యం మత్తులో అనర్థం

- పార్టీలో ఎంజాయ్ చేస్తుండగా మైకంలో నెట్టివేసిన స్నేహితుడు
- సిమ్మింగ్ పూల్‌లో పడి యువకుడి మృతి
- సీసీ ఫుటేజ్‌తో వెలుగులోకి



మృతుడు సాయివర్మ

అచ్యుతాపురం(అనకాపల్లి): మద్యం మైకంలో ఏం చేస్తున్నారో తెలియని స్థితిలో తోటి స్నేహితుని మరణానికి కారణమయ్యాడు మరో స్నేహితుడు. పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన కొండకర్లలోని ఒక ప్రైవేట్ రిసార్ట్‌లో శనివారం రాత్రి స్విమ్మింగ్ పూల్‌లో పడి విజయనగరానికి చెందిన సాయివర్మ అనే యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి పరవాడ డీఎస్పీ శ్రీనివాసరావు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.

మద్యం మత్తులో నృత్యాలు చేస్తూ..

ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న 30 మంది స్నేహితులు కొండకర్లలో ప్రైవేట్ రిసార్టులో శనివారం సందడి చేశారు. స్నేహితుల్లో కొందరు మద్యం సేవించి స్విమ్మింగ్ పూల్ వద్ద నృత్యాలు చేశారు. మద్యం మత్తులో సాయివర్మను మరో స్నేహితుడు సిమ్మింగ్ పూల్‌లోకి నెట్టివేశాడు. నీటిలో పడిపోయిన సాయివర్మకు ఈత రాకపోవడమో లేక మద్యం మత్తు కారణమో గానీ కొంత సేపటికి స్విమ్మింగ్ పూల్‌లో తేలిపోయాడు. అప్పటికే జరగాల్సిన ఘోరం జరిగిపోయింది. సాయివర్మను ఆస్పత్రికి తరలించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. తొలుత అతిగా మద్యం సేవించడం వల్లే నీటిలో మునిగి చనిపోయాడని భావించినప్పటికీ సీసీ ఫుటేజ్ దృశ్యాలను చూసిన తర్వాత పోలీసులు ఘటనకు కారణాన్ని గుర్తించారు. పార్టీలో ఎంజాయ్ చేస్తూ స్నేహితుడే సాయివర్మను నీటిలోకి తోసేసినట్టు గుర్తించారు. అయితే ఉద్దేశ్యపూర్వకంగా జరిగిన ఘటన కాదని భావించిన పోలీసులు సాయంత్రం తర్వాత కేసు నమోదు చేశారు. ఆస్పత్రి వద్ద మృతుని కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

గతంలోనూ...

ఇక్కడి రిసార్ట్‌లో గతంలోనూ కొందరు స్నేహితులు పార్టీ చేసుకొన్న తర్వాత ఒక వ్యక్తి స్విమ్మింగ్ పూల్‌లో పడి చనిపోయాడు. అయితే ఆ సంఘటనకు సంబంధించి ఎటువంటి సీసీ ఫుటేజ్‌లు లేకపోవడంతో కేసు తీవ్రత గుర్తించలేకపోయారు. తాజా ఘటనతో కొండకర్ల పరిసరాల్లో జరిగే పార్టీలపై నిఘా పెట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.

టీడీపీ జెండా ఎన్నాళ్లు మోయాలి?

- సైకిల్‌ను భరించడం మావల్ల కాదు
- ఈ దఫా టికెట్ జనసేనకు కేటాయించాలి
- ఆ పార్టీ కార్యకర్తల డిమాండ్
- అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్న పంచకర్ల



శనివారం పాయకరావుపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గెడ్డం బుజ్జి (ఫైల్)

నక్కపల్లి: టీడీపీ జెండా ఎన్నాళ్లు మోయాలి, సైకిల్‌ను భరించడం మావల్లకాదు ఈ దఫా పాయకరావుపేట అసెంబ్లీ టికెట్ జనసేనకు కేటాయించాలని పలువురు ఆశావహులు పార్టీ సీనియర్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. పొత్తులో భాగంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ప్రచారం అవుతున్న అనితకు మద్దతు ఇచ్చి మళ్లీ కేసుల్లో ఇరుక్కుని ఇబ్బంది పడలేమంటూ వారు శనివారం పాయకరావుపేటలో జరిగిన సమావేశంలోపార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబుకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పార్టీనాయకులు గెడ్డం బుజ్జి ఆధ్వర్యంలో నాలుగు మండలాల నుంచి జన సమీకరణ చేసి, బలప్రదర్శన చేశారు. కేవలం పాయకరావుపేట టికెట్ జనసేనకు కేటాయించాలన్న ప్రధాన ఎజెండాతోనే ఈ సమావేశం నిర్వహించారు. జనసేననుంచి పార్టీ టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మి శివకుమారి, బోడపాటి శివదత్, పెద్దాడ వెంకటరమణ మాట్లాడుతూ ఇప్పటి వరకు జనసేన పార్టీ టీడీపీకి మద్దతు ఇచ్చిందన్నారు. ఇకనైనా నియోజకవర్గ టికెట్ జనసేనకు కేటాయించాలని కోరారు. పార్టీరాష్ట్రకార్యదర్శి, సీనియర్ నాయకులు గెడ్డం బుజ్జి మాట్లాడుతూ 2014లో టీడీపీ అభ్యర్థి అనిత.. జనసేన పార్టీ మద్దతుతో గెలిచి, తర్వాత జనసేన నాయకులు, కార్యకర్తలను చాలా ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు. మళ్లీ అనితకే టికెట్ ఇచ్చి కలిసి పనిచేయాలంటే కష్టమని తెలిపారు. పొత్తులో భాగంగా తప్పనిసరి పరిస్థితిలో పాయకరావుపేట టికెట్ టీడీపీకే ఇవ్వదలిస్తే అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేశారు. అనితకు టికెట్ ఇస్తే మాత్రం కలిసి పని చేసే ప్రసక్తే లేదని తెలిపారు. జనసేన కార్యకర్తల అభ్యర్థనను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు హామీ ఇచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పాయకరావుపేట టికెట్ ఆశిస్తున్న జనసేన నాయకురాలు, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీకుమారి నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోను పర్యటిస్తున్నారు. గ్రామాల్లో జరిగే సమావేశాలు, కార్యక్రమాలలోను జనసేన నాయకులు మాత్రమే పాల్గొంటున్నారు. ఈ నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు ఎడముఖం పెడముఖంగానే ఉంటున్నారు.

వచ్చే నెలలో అయ్యప్ప మహా సంగమం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ట్రస్టు చైర్మన్ ఆదిమోహన్‌రెడ్డి

సీతంపేట: ఏయూ గ్రౌండ్స్‌లో నవంబరు 24, 25, 26 తేదీల్లో అయ్యప్ప మహా సంగమం నిర్వహించనున్నట్టు అయ్యప్ప సేవా ట్రస్టు, అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ ప్రతినిధులు తెలిపారు. శంకరమఠంలో ఆదివారం ట్రస్టు చైర్మన్ పైలా ఆదిమోహన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఈ మహా సంగమంలో ఉత్తరాంధ్ర నుంచి వేల సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. 25న విలక్ ఉత్సవం, 26న పడి పూజతో పాటు విద్యాహోమం, సంతాన సాఫల్య హోమం, పార్వతీ హోమం నిర్వహిస్తామన్నారు. కేరళ నుంచి శబరిమల ప్రధాన తంత్రి కంఠరారు రాజీవరు, తంత్రి కంఠరారు బ్రహ్మదత్తన్, 15 మంది మేల్ శాంతి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో శ్రీ పూర్ణ పుష్కల అయ్యప్ప సేవా ట్రస్ట్ చైర్మన్ ఎం.క్రిష్ణయ్య, అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, పూజా కోర్ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, చైర్మన్ ఆదిమూలపు నాగరాజు, కార్యదర్శి గాడు తాతినాయుడు, వైస్ చైర్మన్ టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

2న జిల్లాలోకి సామాజిక సాధికార బస్సు యాత్ర

ఎంపీ బి.వి.సత్యవతి



అనకాపల్లిటౌన్: శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి బయలుదేరిన సామాజిక సాధికార బస్సు యాత్ర వచ్చేనెల 2వ తేదీన జిల్లాలోకి ప్రవేశిస్తుందని ఎంపీ బి.వి.సత్యవతి తెలిపారు. స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో మాడుగుల ఘాట్‌రోడ్డులో యాత్ర ప్రారంభమై స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానానికి 9న చేరుకుంటుందని చెప్పారు. స్టేడియంలో అదేరోజు భారీ బహిరంగసభ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఎన్టీఆర్ వైద్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో రూ.22.15 కోట్లతో డయాలసిస్, ట్రామాకేర్ సెంటర్ల నూతన భవన నిర్మాణ పనులకు వారం రోజుల్లో శ్రీకారం చుట్టనున్నట్టు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈ భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.15 లక్షలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. మూడు అంతస్తుల్లో భవన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఎన్టీఆర్ క్రీడా మైదానాన్ని జాతీయ స్టేడియంగా రూ.కోటితో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. సీఎస్ఆర్ నుంచి రూ.40 లక్షలు, జీవీఎంసీ నుంచి రూ.30 లక్షలు, ఎంపీ నిధులు రూ.30 లక్షలతో మైదానం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు చెప్పారు. క్రీడామైదానంలో మహిళలకు వ్యాయామశాల, పవర్, వెయిట్‌లిఫ్టర్లకు కావాల్సిన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. రాజీవ్‌గాంధీ ఇండోర్‌స్టేడియంను జీవీఎంసీ నిధులతో అభివృద్ధి పరుస్తామని చెప్పారు. సుంకరమెట్ట వై కూడలి వద్ద సర్కిల్ ఏర్పాటు చేసి బుద్ధుని విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శంకరం గ్రామంలో గల బొజ్జన్నకొండ అభివృద్ధి పనులు డిసెంబర్ నెలాఖరుకల్లా పూర్తవుతాయని చెప్పారు. బొజ్జన్నకొండను కేంద్ర టూరిజం శాఖ సందర్శించనుందని తెలిపారు. కొండ చుట్టూ రూ.98 లక్షలతో లైటింగ్ ఏర్పాటుకు టెండర్లు పిలుస్తున్నట్టు చెప్పారు. మండలంలో సీతానగరం హైస్కూల్ క్రీడామైదానం చుట్టూ ఎంపీ నిధులు రూ.36 లక్షలతో ప్రహరీ నిర్మాణాన్ని చేపడుతున్నట్టు చెప్పారు. నాలుగున్నరేళ్లలో 98 శాతం ఎంపీ నిధులు ఖర్చు చేసినట్టు చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల మరమ్మతులకు రూ.50 లక్షలు మంజూరు చేసినట్టు ఆమె తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెంలో జిల్లా వైద్య కళాశాల నిర్మాణ పనులు 2025-26 సంవత్సరంలో పూర్తికానున్నాయని ఆమె చెప్పారు. బడుగు, బలహీనవర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలుపించుకునే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.

ఆర్బీకేల ద్వారా పశుగ్రాస విత్తనాలు

- 75 శాతం సబ్సిడీపై జొన్న, మొక్కజొన్న, సజ్జ, అలసంద విత్తనాల పంపిణీ
- సర్టిఫై చేసిన సీఎస్‌హెచ్-24 విత్తనాల సరఫరా

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా సర్టిఫై చేసిన నాణ్యమైన పశుగ్రాస విత్తనాలను రైతులకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. 75 శాతం సబ్సిడీపై స్థానికంగా డిమాండ్ ఎక్కువగా ఉన్న సీఎస్‌హెచ్-24 జొన్న రకం పశుగ్రాసం విత్తనాలను, మొక్కజొన్న, సజ్జ, అలసంద విత్తనాలను అందిస్తోంది. ప్రస్తుతం 48 టన్నుల వరకు జొన్న, మొక్కజొన్న, సజ్జ, అలసంద విత్తనాలను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచింది. 20 సెంట్ల నుంచి ఎకరం పొలం కలిగిన చిన్న, సన్నకారు రైతులకు 5 నుంచి 20 కిలోల వరకు సరఫరా చేయనున్నారు. ఆర్బీకేల్లో భూమి పాస్ పుస్తకం నకలు సమర్పించి విత్తనాలను సబ్సిడీపై పొందవచ్చు.

జొన్న విత్తనాలు

జిల్లాలో 11.52 టన్నుల సీఎస్‌హెచ్-24 రకం జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఈ విత్తనాలతో ఎకరానికి 35 నుంచి 40 టన్నుల వరకు (3 కోతలలో) దిగుబడి వస్తుంది. ఎకరానికి కావలసిన 15 కిలోల విత్తనాలు మార్కెట్ ధర రూ.460 కాగా, ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై రూ.115కు అందజేస్తోంది. ఈ పశుగ్రాసంలో మాంసకృత్తులు 7 నుంచి 8 శాతం వరకు ఉంటాయని పశువైద్యులు సైతం వెల్లడించారు. ఈ రకం జొన్న కీటకాలు, తెగుళ్ల రాకుండా తట్టుకోగలదు.

మొక్కజొన్న

జిల్లాలో 8.08 టన్నుల ఆఫ్రికన్ టాల్ రకం మొక్కజొన్న విత్తనాలను అందుబాటులో ఉంచారు. ఎకరాకు 12 నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. 5 కిలోల విత్తనాల మార్కెట్ ధర రూ.340 కాగా, 75 శాతం సబ్సిడీతో రూ.85కు విక్రయిస్తున్నారు. ఈ పశుగ్రాసంలో 11 నుంచి 13 శాతం వరకు మాంసకృత్తులుంటాయని వైద్యులు వెల్లడిస్తున్నారు.

అలసందలు

జిల్లాలో 15.44 టన్నుల ఈసీ 4215 రకం అలసంద విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఎకరానికి 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఎకరానికి 9 నుంచి 10 కిలోల వరకు విత్తనాలు అవసరం. 3 కిలోల విత్తనాల మార్కెట్ ధర రూ.295 కాగా, 75 శాతం సబ్సిడీ మినహాయించి రైతులకు రూ.73 ధరతో అందజేస్తున్నారు. ఈ పశుగ్రాసంలో మాంసకృత్తులు 18 నుంచి 21 శాతం వరకు ఉంటాయి. వీటితో పాటుగా జీర్ణమయ్యే పదార్థాల శాతం 49 నుంచి 51 శాతం వరకు ఉంటుంది.

సజ్జలు

జిల్లాలో 1.796 టన్నుల బీఏఐఎఫ్-1 రకం సజ్జ విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎకరానికి 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఇవి ఒక ఎకరానికి 3 నుంచి 4 కిలోల వరకు సరిపోతాయి. కిలో విత్తనాల మార్కెట్ ధర 98 కాగా, ప్రభుత్వ సబ్సిడీ 75 శాతం పోను రూ.24.5లకే అందిస్తున్నారు.



ఆర్బీకేల్లో విత్తనాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు(ఫైల్)

ఆర్బీకేల్లో సంప్రదించండి



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్బీకేల ద్వారా సర్టిఫై చేసిన నాణ్యమైన పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నాం. అర్హత, ఆసక్తి కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సమీప ఆర్బీకేల్లోని పశుసంవర్థక సహాయకులను సంప్రదించి, నాణ్యమైన సీఎస్‌హెచ్-24 విత్తనాలను తీసుకుని అదును దాటిపోకుండా నాటుకోవాలి.

– డాక్టర్ ప్రసాదరావు,
పశుసంవర్థక శాఖ జేడీ

క్లుప్తంగా

అప్పన్న ఆలయంలో గ్రహణ సంప్రోక్షణ పూజలు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున గ్రహణ సంప్రోక్షణ పూజలను విశేషంగా నిర్వహించారు. చంద్ర గ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం 5.15 గంటలకు ఆలయాన్ని మూసివేసిన విషయం తెలిసిందే. గ్రహణానంతరం ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు తిరిగి ఆలయాన్ని తెరిచి స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ సంప్రోక్షణ, హోమాలు నిర్వహించారు. తరువాత ఆరాధన, బాలభోగం సేవలను నిర్వహించి ఉదయం 8 గంటల నుంచి భక్తులకు దర్శనాలు పునరుద్ధరించారు.

నేడు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ విశాఖ రాక

మహారాణిపేట: పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సోమవారం విశాఖ రానుందని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఈ నెల 31న వ్యాపార, వాణిజ్య అంశాలపై వివిధ బ్యాంకుల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కమిటీ సభ్యులు సమావేశం కానున్నారని వెల్లడించారు. కేవీఐసీ, యుఐబీ నోడల్ ఏజెన్సీలుగా వ్యవహరిస్తున్నాయని..అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సీహెచ్ గణపతికి కలెక్టర్ సూచించారు.

బుచ్చియ్యపేటలో 50 మందిపై కేసులు

కశింకోట: మండలంలోని బుచ్చియ్యపేట గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన కొట్లాటకు సంబంధించి 50 మందిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. బుచ్చియ్యపేటకు చెందిన టీడీపీ సోషల్ మీడియా ప్రతినిధి బుదిరెడ్డి రామారావు, అదే గ్రామ పాల సంఘం అధ్యక్షుడు బుదిరెడ్డి రాజు (బులెట్ రాజు)పై వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారని ఆయన చెప్పారు. ఇదేమని అడగడంతో శనివారం రాత్రి ఇద్దరూ ఘర్షణ పడ్డారు. ఈ నేపథ్యంలో ఇద్దరికీ చెందిన అనుయాయులు మద్దతుగా వచ్చి పరస్పరం కొట్లాటకు దిగారు. దీంతో తమకు అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి సిబ్బందితో వెళ్లి కొట్లాటను నివారించి, రామారావు, రాజు వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు 50 మందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. రాజు టీడీపీలో వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనే అభియోగం రావడంతో ఆ పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైనట్టు సమాచారముందన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నపూర్ణగా...

- 14 ఏళ్లుగా దీక్షధారులకు నిత్యాన్నదానం
- ఏటా కార్తీక మాసంలో పైల సన్యాసమ్మ సేవాభావం



వంట పనులు చేస్తున్న సన్యాసమ్మ



స్వాములకు వడ్డిస్తున్న సన్యాసమ్మ, ఆమె అల్లుడు సత్యనారాయణ

రావికమతం: పైల సన్యాసమ్మ.. రావికమతం, రోలుగుంట మండలాల్లో పలు గ్రామాల్లో ఈ పేరు విననివారుండరు. భోగాపురం, దిబ్బలపాలెం, గంపవానిపాలెం, జెడ్.కొత్తపట్నం, వమ్మవరం, కన్నంపేట, మత్రివలస తదితర గ్రామాల్లో వందలాది మందికి అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులకు ఏటా కార్తీక మాసంలో నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అన్నదాన ప్రభువే..సుఖీభవ అంటూ భక్తుల శరణుఘోషతో కొత్తకోట మారు మోగుతోంది. గ్రామానికి చెందిన పైల సన్యాసమ్మ భర్త పోలీసు ఉద్యోగం చేస్తూ 25 ఏళ్ల క్రితం మృతిచెందారు. ఆమె కుమారులు మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. మానవసేవయే మాధవ సేవగా భావిస్తూ సన్యాసమ్మ నేటికి 14 ఏళ్లుగా ఏటా కార్తీక మాసంలో కొత్తకోట, పరిసర గ్రామాల్లోని స్వామి అయ్యప్ప భక్తులకు మధ్యాహ్నం (భిక్ష) అన్నదానం చేస్తున్నారు. కొత్తకోటలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద స్వాములందరికీ సన్యాసమ్మే స్వయంగా వంట పనులు చేస్తున్నారు. అల్లుడు సత్యనారాయణ, సోదరి, ఇతర బంధువులు సహాయ సహకారాలందిసున్నారు. నిత్యం 150 నుంచి 200 మంది వరకూ భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో రోజు ఎక్కువ మంది స్వాములొస్తే మరలా వంటలు చేసి పెడుతున్నారు. ఆమె చేస్తున్న కృషికి కుటుంబీకులతో పాటు పలువురు స్వాములు, భక్తులు సహాయ సహకారాలందిస్తున్నారు. ఆమె సేవలను కొనియాడుతున్నారు.

దాతలు చల్లగా ఉండాలి



నేడు 33 ఏళ్లుగా స్వామి మాలధారణ చేస్తున్నాను. సన్యాసమ్మ మాత 14 ఏళ్లుగా నిష్ఠతో భిక్ష ఏర్పాటు చేస్తుండడంతో ఎంతో మంది భక్తులు దీక్షలు సునాయాసంగా చేస్తున్నారు. ఇటీవల కొందరు దాతలు ఉదయం పూట వడి కూడా ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతీయుల దీక్షలు నిర్విఘ్నంగా సాగుతున్నాయి. దాతలు చల్లగా ఉండాలి.

–బళ్లా నర్సింగరావు, గురుస్వామి, కొత్తకోట

ఆమె సేవ ఎంతో గొప్పది



రెండేళ్ల క్రితం, ప్రస్తుతం మాలధారణ చేశాను. అపుడూ ఇపుడూ సన్యాసమ్మ మాత చేస్తున్న అన్నదానం కార్యక్రమంలో పాల్గొంటున్నాను. నా దీక్ష నిర్విఘ్నంగా సాగుతోంది. నిత్యం ఇంత మందికి ఎంతో ఓపికతో చేస్తున్న ఆమె సహనం ఎంతో గొప్పది. డబ్బు ఖర్చుచేయడమే కాదు. సహనంతో వంటలు చేసి వడ్డించి, ఆకులు సైతం భక్తితో తీస్తూ అన్నపూర్ణ దేవిగా నిలుస్తున్నారు.

–వీసం రవి, భక్తుడు, దిబ్బలపాలెం

భగవంతుని సేవగా భావిస్తున్నా...



పిల్లలు స్థిరపడ్డారు. దేవుని దయతో అందరూ బాగున్నారు. వయస్సు మీరింది. భగవంతుని సేవలో తరించాలని తనకు తోచినట్టుగా చేస్తున్నాను. అంతా సహకరిస్తున్నందుకు ఆనందంగా ఉంది.

–పైల సన్యాసమ్మ,అన్నదాత, కొత్తకోట

2 నుంచి గిరిజన యూత్ ఎక్ఛేంజ్ ప్రోగ్రాం

క్రీడా పోటీల గోడపత్రిక ఆవిష్కరించిన ఎంపీ సత్యవతి




పోటీల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: క్రీడల ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించవచ్చని ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్టులో ఆదివారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడాపోటీల గోడపత్రికను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అచ్యుతాపురం ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌లో నవంబర్ 2వ తేదీ 8వ తేదీ వరకు 15వ గిరిజన యువత ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలు క్రీడా పోటీలకు బీహార్, మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన 9 జిల్లాల నుంచి యువత హాజరుకానుందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా క్రీడల మంత్రిత్వశాఖ అధికారి జి.మహేశ్వరరావు, నెహ్రూ యువకేంద్రం ఉద్యోగులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ...

జిల్లాలో ఇటీవల కేంద్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సదరం శిబిరాల్లో ఎంపికైన దివ్యాంగులకు కావాల్సిన పరికరాలు నవంబర్ మూడో వారంలో స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో అందించనున్నామని ఎంపీ సత్యవతి తెలిపారు. సుమారు రూ.కోటి 60 లక్షలు విలువ చేసే పరికరాలను ఉచితంగా అందిస్తున్నామని, ఈ కార్యక్రమానికి కేంద్ర సామాజిక న్యాయ సహాయ మంత్రి నారాయణస్వామి హాజరవుతారని చెప్పారు. బ్యాటరీ సామర్థ్యంతో నడిచే మూడు చక్రాల వాహనాలకు తన ఎంపీ నిధులు రూ.36 లక్షలు మ్యాచింగ్ గ్రాంట్‌గా విడుదల చేసినట్టు చెప్పారు. జాతీయ రహదారి జలగలమదుం జంక్షన్ వద్ద ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయనున్న జాతీయజెండాను నవంబర్ 7న ఆవిష్కరిస్తామన్నారు.

తాండవ నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

పాయకరావుపేట: తాండవ నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు ఎస్ఐ బి.జోగారావు తెలిపారు. రైల్వే ట్రాక్ కిందన ఒడ్డుకి 10 అడుగుల దూరంలో మృతదేహం ఉందన్నారు. రైలులో ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తుజారి నదిలో పడివుండవచ్చని చెప్పారు. గుర్తుపట్టేందుకు వీలులేకుండా మృతదేహం ఉందని తెలిపారు. మృతుడు నలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ నెక్ బనియన్, నలుపురంగు జీన్‌ప్యాంట్ ధరించి ఉన్నట్టు చెప్పారు. మృతుని వద్ద ఖైనీ ప్యాకెట్టు, రూ.670 నగదు ఉన్నాయని, స్థానిక వీఆర్వో వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టానికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

మాడుగుల టీడీపీలో వర్గపోరు

నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యేల వేరు కుంపట్లు



ఘాట్‌రోడ్డు జంక్షన్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు

మాడుగుల రూరల్: మాడుగుల నియోజకవర్గం టీడీపీలో వర్గపోరు తారస్థాయికి చేరుకుంది. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మరో నాయకుడు పైలా ప్రసాదరావుతో పాటు మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మధ్య పోటీ తీవ్రంగా ఉంది. ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ ఆధ్వర్యంలో శనివారం మాడుగులలో నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జులతో విస్తృతస్థాయి సమావేశం జరిగింది. దీనికి అనకాపల్లి పార్లమెంటు జిల్లా పార్టీ అధ్యక్షుడు బుద్దా నాగజగదీశ్వరావు హాజరయ్యారు. భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. అయితే ఒక్క రోజు వ్యవధిలోనే ఆదివారం మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఘాట్ రోడ్డు జంక్షన్ సమీపంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. దీనికి చీడికాడ, మాడుగుల, మండల పార్టీ అధ్యక్షులతోపాటు, మండల ప్రధాన కార్యదర్శి, పార్టీకి చెందిన సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, కొందరు క్లస్టర్ ఇన్‌చార్జులు కూడా హాజరయ్యారు. దీనికి నియోజకవర్గ ఇన్‌చార్జి కుమార్, మరో ఆశావహుడు పైలా ప్రసాదరావు హాజరు కాలేదు. దీంతో పార్టీ అధిష్టానాన్ని ధిక్కరించి రామానాయుడు ఈ సమావేశాన్ని ఏర్పాటుచేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. శనివారంనాటి విస్తృతస్థాయి సమావేశంలోనే పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు నాగజదీశ్వరరావు ఈ సమావేశంతో పార్టీకి సంబంధం లేదని ప్రకటించారు. అయినప్పటికీ రామానాయుడు సమావేశాన్ని నిర్వహించి, గెలుపు గుర్రాలకే టికెట్ ఇవ్వాలని, వేరే పార్టీ నుంచి పార్టీలోకి వచ్చినవారికి టికెట్ ఇవ్వడం సరికాదని ఆక్షేపించారు. ఈ వర్గపోరుపై అధిష్టానం ఏ మేరకు చర్యలు తీసుకుంటుందో చూడాలి.

వేడుకగా భారత వికాస్ పరిషత్ బృందగాన పోటీలు



బృందగాన పోటీలను డ్రా ప్రారంభిస్తున్న డీఎస్పీ సుబ్బరాజు

అనకాపల్లిటౌన్: విద్యార్థి దశ నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డీఎస్పీ వి.సుబ్బరాజు అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి వివేకానంద ఫంక్షన్ హాల్లో భారత వికాస పరిషత్ ప్రాంత స్థాయి జాతీయ బృందగాన పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో అనకాపల్లి నుంచి 7 టీమ్‌లు, రాజమహేంద్రవరం నుంచి 3 టీమ్‌లు, కొవ్వూరు నుంచి ఒక టీమ్ వచ్చినట్టు ఆయన చెప్పారు. హైస్కూల్, కళాశాల స్థాయి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్టు తెలిపారు. హిందీ, సంస్కృత విభాగంలో నిర్వహించడం వల్ల నేటి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు.

హిందీ, సంస్కృత విభాగంలో ...

ప్రథమ బహుమతి విశాఖ వేలీ స్కూల్ జాన్సీలక్ష్మీబాయి బృందానికి, ద్వితీయ బహుమతి విశాఖ మెయిన్ బ్రాంచ్(పరిషత్) శ్రీకృష్ణ విద్యామందిర్ బృందానికి, తృతీయ బహుమతి రాజమహేంద్రవరం అక్షర శ్రీస్కూల్ బృందానికి, కన్సొలేషన్ బహుమతి స్థానిక సాయికుల్వంత్ జూనియర్ కళాశాల బృందానికి వచ్చాయి.

జానపద/ప్రాంతీయ గీతాల విభాగంలో...

ప్రథమ బహుమతి విశాఖ వ్యాలీ స్కూల్ జాన్సీలక్ష్మీబాయి బృందం, ద్వితీయ బహుమతి విశాఖ మెయిన్ బ్రాంచ్ శ్రీకృష్ణ విద్యామందిర్ బృందం, తృతీయ బహుమతి సాయికుల్వంత్ జూనియర్ కళాశాల విద్యార్థులకు, కన్సొలేషన్ బహుమతి కొవ్వూరు బృందం దక్కించుకున్నారు. ఎంతో సందడిగా జరిగిన ఈ కార్యక్రమానికి న్యాయమూర్తులుగా జి.రామయ్యరెడ్డి, డి.చిట్టిబాబు, కె.జ్ఞానేశ్వరి వ్యవహరించారు. కార్యక్రమంలో పరిషత్ పట్టణ అధ్యక్షుడు ఆళ్ల ఓంరామ్, కార్యదర్శి ఎన్.ఎ.బి.వర్మ, కోశాధికారి దాడి శివరాము, సభ్యులు ఎస్.గోపాలరావు, గౌరీపతి, బ్రహ్మానందం, కె.ఎల్.ఎస్.మూర్తి, లక్ష్మీనారాయణ, కేశవరావు, బి.వి.రాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫుట్‌బాల్ మ్యాచ్

క్రీడాకారులకు జర్సీలు,షూ,బాల్స్ అందజేత



స్పాన్సర్లు అందజేసిన కొత్త జెర్సీలతో క్రీడాకారులు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఎగ్జిబిషన్ మ్యాచ్ ఉత్సాహంగా జరిగింది. యలమంచిలి, విశాఖపట్నం జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో ఇరు జట్ల క్రీడాకారులు గోల్స్ చేసేందుకు చెమటోడ్చి ఆడారు. యలమంచిలిలో హాకీ, క్రికెట్ మ్యాచ్‌లే ఎక్కువగా జరుగుతుంటాయి. కానీ ఆదివారం తొలిసారిగా ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహించడంతో స్థానిక క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఎగ్జిబిషన్ మ్యాచ్ కావడంతో ఇరు జట్ల క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఎవరినీ విజేతలుగా ప్రకటించకుండా ముగించారు. ఫుట్‌బాల్ మ్యాచ్‌ను చూసేందుకు విద్యార్థులు, యువత ఆసక్తి కనబరిచారు. మ్యాచ్ ముగిసిన అనంతరం ఇరు జట్ల క్రీడాకారులకు విశాఖకు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు చెల్లా సుస్మిత జెర్సీలు, షూ, బంతులను ఉచితంగా అందజేశారు. ఫుట్‌బాల్ క్రీడను ప్రోత్సహించడానికి ఆమె తరచూ ఐదు జిల్లాల్లో క్రీడాకారులకు ఉచితంగా క్రీడాసామగ్రిని అందజేస్తుండడంతో పలువురు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.గోవిందరావు, జిల్లా కార్యదర్శి బోదెపు రామకష్ణ,ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర, యలమంచిలి మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, ఛార్టెర్డ్ అకౌంటెంట్ బిఎస్ బంగారుశెట్టి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పోలిరెడ్డి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు ఏబీఎల్ రాజు,పిల్లా రాము పాల్గొన్నారు.

వెటరన్ అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారుల సత్తా



విశాఖలో పతకం అందుకుంటున్న ఉపాధ్యాయుడు డేవిడ్



విశాఖలో బంగారు పతకాలు అందుకుంటున్న కె.జె.పురం హైస్కూలు పీడీ ప్రసాదు

కోటవురట్ల/మాడుగుల రూరల్: వెటరన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చూపి పతకాలు సాధించారు. విశాఖలోని పోలీసు బ్యారెక్స్‌లో ఆదివారం జరిగిన వెటరన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కోటవురట్ల జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు పి.డేవిడ్ 800 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 200, 100 మీటర్ల పరుగు పోటీల్లో వెండి పతకాలు సాధించారు. మాడుగుల మండలం కేజే పురం జిల్లా పరిషత్ హైస్కూలు ఫిజికల్ డైరెక్టరు కొలిరెడ్డి ప్రసాదు 200 మీటర్ల పరుగు పోటీతో పాటు లాంగ్‌జంప్‌లో బంగారు పతకాలు సాధించారు. డిసెంబరు 9, 10 తేదీల్లో కావలిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ప్రసాద్‌ను కె.జె.పురం హైస్కూలు హెచ్ఎం వి.దాసు, స్కూలు కమిటీ చైర్మన్ మళ్ల కిశోర్, కమిటీ సభ్యులు అభినందించారు.

ముగిసిన ఏఎంసీ శతాబ్ది వేడుకలు



ఎంపీ సత్యవతిని సన్మానిస్తున్న సినీ గీత రచయిత అశోక్ తేజ, ఎంఎం శ్రీలేఖ తదితరులు

- ఆట పాటలతో హోరెత్తిన ప్రాంగణం
- అలరించిన సినీ గాయకులు

బీచ్‌రోడ్డు: ఆంధ్రా మెడికల్ కళాశాల శతాబ్ది వేడుకలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుకల్లో సినీ సంగీత దర్శకురాలు ఎం.ఎం శ్రీలేఖ, గాయకులు గీతా మాధురి, అరుణ్ కౌటిల్య, ధనుంజయ్ తదితరులు తమ గాత్రంతో హోరెత్తించారు. తెలుగు, హిందీ పాటలను పాడి వైద్య విద్యార్థులను ఉత్సాహపరిచారు. కొమరం భీముడో, యూ ఆర్ మై ఎమ్మెల్యే, ఓ సీత, బంగారు కోడి పెట్ట తదితర పాటలు ఆలపించి.. అలరించారు. గాయకులు పాడిన పాటలకు విద్యార్థులు తమదైన శైలిలో డ్యాన్సులు చేసి ఎంజాయ్ చేశారు.

ఎంపీ సత్యవతికి సన్మానం

అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతిని సినీ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ, సంగీత దర్శకురాలు ఎం.ఎం.శ్రీలేఖ ఘన సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వందేళ్లు పూర్తి చేసుకున్న ఏఎంసీలో తాను కూడా చదువుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. తన వంతుగా ఏఎంసీ వుమెన్స్ హాస్టల్ కోసం ఎంపీ నిధుల నుంచి రూ.15లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రజలు దైవంగా భావించే వైద్య వృత్తికి మరింత వన్నె తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

తేనెలొలుకు తెలుగు

వేడుకగా తెలుగు సాహిత్య వైభవ్



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

బీచ్‌రోడ్డు: తెలుగు భాష చాలా పురాతనమైందని, రెండో శతాబ్దం నుంచి తెలుగు ప్రస్తావన ఉందని పలువురు వక్తలు అన్నారు. ఆంధ్రా మెడికల్ కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో ఆదివారం 'తెలుగు సాహిత్య వైభవ్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు తెలుగు సాహిత్యం గురించి మాట్లాడుతూ రామాయణం, మహాభారతంలో వైద్యం కోసం పొందుపర్చిన అంశాలను వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంసీ పూర్వ విద్యార్థి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు మాట్లాడుతూ తెలుగు కథ ప్రపంచ నలుమూలలకు చేరిందన్నారు. ఏఎంసీ శతాబ్ది ఉత్సవాల్లో తెలుగు సాహిత్యం కోసం కృషి చేస్తున్న వారిని గౌరవించడం ఆనందంగా ఉందన్నారు. ఏఎంసీతో తనకు తొమ్మిదేళ్ల అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. ప్రముఖ సాహిత్య రచయిత ప్రొఫెసర్ బేతాళ రాంబ్రహ్మం మాట్లాడుతూ నేటి సాహిత్యం చూస్తుంటే ఏదో తెలియని బాధ కలుగుతోందన్నారు. సాంకేతికతను వినియోగించుకుని నేటి తరానికి అర్థమయ్యే విధంగా సాహిత్యాన్ని రూపొందించాలన్నారు. వైద్యం కోసం సాహిత్య రూపంలో గ్రంథాలను అందించడం చాలా అభినందనీయమన్నారు. ప్రముఖ సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ సినిమా పాటల్లో సాహిత్యం లేదని పలు వేదికల్లో సాహిత్యవేత్తలు వ్యాఖ్యానించడం బాధాకరమన్నారు. చాలా పాటల్లో సాహిత్యం దాగి ఉంటుందని చెప్పారు. వచనం, ఛమత్కారం, సంగీతం, నాట్యం, చిత్ర లేఖనం, యుద్ధ నైపుణ్యత, నటన అన్ని కలిస్తే సినిమా అని, అలాంటి సినిమాల్లో పాట రాయడం గొప్ప అవకాశంగా భావిస్తామన్నారు. సాహిత్యంతో కూడిన పలు పాటలను ఆయన ప్రస్తావించారు. అనంతరం ప్రముఖ డాక్టర్, రచయిత ఈదర పెదవీర్రాజు రచించిన పద్యాల్లో వంద ఉత్తమ పద్యాలతో రూపొందించిన 'శత కవితా ఝరి'పుస్తకాన్ని ఈ సందర్భంగా అతిథులు ఆవిష్కరించారు. కళారత్న మీగడ రామలింగేశ్వరరావు, సభా అధ్యక్షుడు డాక్టర్ రఘురామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య దిక్సూచి 'యోగా'



యోగాసనాలు ప్రదర్శిస్తున్న మహిళలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విలేజ్ వేదికగా నిర్వహించిన ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. ఆదాయ పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ శంకర్ పాండి ఆదివారం ఉదయం జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత వీసీ డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్, జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు యోగా రాజు, కార్యదర్శి సీహెచ్ వెంకట రమేష్, ఏయూ యోగా విభాగం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భానుకుమార్ తదితరులు ప్రసంగించారు. అనంతరం వివిధ విభాగాల వారీగా మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పోటీ పడి యోగాసనాలు వేశారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



విజేతలతో నిర్వాహకులు

క్లుప్తంగా

31న మినీ జాబ్‌మేళా

అనకాపల్లిటౌన్ : నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా నర్సీపట్నంలో ఎంఎల్ ఏఎస్ కళాశాలలో ఈనెల 31న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధిశాఖ అధికారి చాముండేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకూ చదువుకుని 18 నుంచి 25 సంవత్సరాలు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకుల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మర్ని వివరాలకు 7036363272 నంబరులో సంప్రదించాలని కోరారు.

తొలగించిన వృక్షం.. మరో చోట నాటింపు



చెక్కు చెదరకుండా వృక్షాన్ని మరో స్థలంలో నాటేందుకు తీసుకొస్తున్న జేసీబీ

అనకాపల్లిటౌన్ : ఒకపక్క అభివృద్ధి దిశగా అడుగులు వేస్తూనే అటు పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోంది. స్థానిక జాతీయ రహదారి సుంకరమెట్ట జంక్షన్ రహదారి విస్తరణ చకచకా జరుగుతోంది. రహదారి నిర్మాణ పనులకు అడ్డంకిగా మారిన 8 పెద్ద వృక్షాలను జేసీబీ సహాయంతో వేళ్లతో తేల్చి ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో మరలా నాటి వాటి పరిరక్షణకు ప్రభుత్వం పాటు పడుతోంది.

ఉత్సాహంగా చిల్డ్రన్ క్లబ్



చిల్డ్రన్ క్లబ్‌లో కథలు చెప్తున్న లైబ్రేరియన్ దమయంతి

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చిల్డ్రన్స్ క్లబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు మాస్ రీడింగ్‌లో భాగంగా సింహం రాజు తెలివి, కష్టజీవి గెలుపు కథలను లైబ్రేరియన్ దమయంతి వివరించారు. నీతి కథల ద్వారా జ్ఞానంతోపాటు, నైతిక విలువలు పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ పిల్లలచే పజిల్ గేమ్ ఆడించారు. ప్రతి ఆదివారం నిర్వహించే చిల్డ్రన్స్ క్లబ్‌ను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా విద్యార్థులకు సూచించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 1,475 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,390	4,900
మొదటి రకం	3,750	4,380
రెండో రకం	3,520	4,100
మూడోరకం	3,000	3,510

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
లియో	:సత్యనారాయణస్క్రీన్-1
చిన్నా	:సత్యనారాయణస్క్రీన్-2
భగవంత్ కేసరి	: షిర్డిసాయి
టైగర్ నాగేశ్వరరావు	: పర్తిసాయి
గణపథ్(తెలుగు)	: వెంకటేశ్వర
ఓటు చాలా విలువైనది (ఉ॥ మ॥)	
ధీమహి (ఫస్ట్ షో, సెకండ్ షో)	: శ్రీసత్య
భగవంత్ కేసరి	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 36 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఎ'పాజిటివ్-11 యూనిట్లు, 'ఎ'నెగెటివ్-2 యూనిట్లు, 'బి'పాజిటివ్-6 యూనిట్లు, 'బి'నెగెటివ్-2 యూనిట్లు, 'ఒ'పాజిటివ్-14 యూనిట్లు, 'ఎబి'పాజిటివ్-3 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 331 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

పేదలకు భరోసా.. జగనన్న ఆరోగ్య సురక్ష



కన్నూరుపాలెంలో సేలందిస్తున్న ఆయుర్వేద వైద్యురాలు లావణ్య



తీడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో స్పాట్ రిజిస్ట్రేషన్

- 18 సచివాలయాల్లో వైద్య శిబిరాలు
- 8057 మందికి వైద్య సేవలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కశింకోట : మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. 8057 మంది ఉచిత వైద్య సేవలు పొందారు. 18 సచివాలయాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. అన్ని శిబిరాలు విజయవంతం అయ్యాయి. సాధారణ వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు, రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు ఒకేచోట నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 20 సచివాలయాలున్నాయి. ఇవి కశింకోట, తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్నాయి. ఆయా కేంద్రాలు నెలకొని ఉన్న చెరో సచివాలయం మినహా మిగిలిన 18 సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు. చిన్న పిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు శిబిరాలను వినియోగించుకున్నారు. ఈ నెల 3న జమాదులపాలెంలో మొదటి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి శ్రీకారం చుట్టారు. దీనికి విశేష ఆదరణ లభించింది. అక్కడి నుంచి నిర్వహించిన దాదాపు అన్ని శిబిరాల్లో విశేష జనాదరణ లభించింది. కశింకోట-1,3,4 సచివాలయాలు, వెదురుపర్తి, బయ్యవరం, తేగాడ, కొత్తపల్లి, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, జెట్టపురెడ్డితుని, ఏఎస్ పేట, నూతలగుంటపాలెం, అచ్చెర్ల, జి. భీమవరం, చింతలపాలెం, ఈ.చౌడువాడ (కన్నూరుపాలెం), తీడ సచివాలయాల్లో శిబిరాలు నిర్వహించారు. వీటిలో తీడ శిబిరంలో అత్యధికంగా 624 మంది వైద్య సేవలు పొందడం విశేషం. శిబిరాల్లో 8057 మంది వైద్య సేవలు పొందారు. వీరిలో 1357 మంది కంటి రోగులకు సేవలందించారు. 146 మందికి కేటరాక్టు ఆపరేషన్లు, 1007 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి సిఫారసు చేశారు. శిబిరాల్లో జనరల్ సర్జన్లు, గైనకాలజిస్టులు, ఈఎన్‌టీ తదితర ప్రత్యేక వైద్యులతో పాటు స్థానిక పీహెచ్‌సీల వైద్యులు, ఆప్తాల్మజిస్టులు సేవలందించారు. బీపీ, సుగర్, మూత్రం, మలేరియా, డెంగ్యూ జ్వరం, రక్త శాతం తెలుసుకోవడానికి పది రకాల పరీక్షలు నిర్వహించారు. గుండె సంబంధిత సమస్యలు తెలుసుకోవడానికి ఈసీజీ పరీక్షలు జరిపారు. ఉచితంగా మందులు అందజేశారు. శిబిరాల్లో స్పాట్ రిజిస్ట్రేషన్, ఇంటింటి సర్వేలో గుర్తించిన వారికి ప్రత్యేక కౌంటర్, నలుగురు వైద్యులు సేవలందించడానికి ప్రత్యేక విభాగాలు, కంటి పరీక్షలు, మందుల పంపిణీ, రక్త పరీక్షలు, గర్భిణులకు తనిఖీలు వగైరా నిర్వహించారు. ఈ.చౌడువాడ, తీడ శిబిరాల్లో ప్రత్యేక ఆయుర్వేదిక్ శిబిరాన్ని కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యురాలు కె. లావణ్య నిర్వహించారు. ఆయుర్వేదంతో పాటు యోగా, ధ్యానం పట్ల అవగాహన కలిగించారు. దీంతో ప్రజలు ఉత్సాహంగా శిబిరాల్లో సేవలు వినియోగించుకున్నారు. అంతే కాకుండా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం ప్రాధాన్యం, ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యం, ఆరోగ్య అంశాలకు సంబంధించి విభాగాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన పరిచారు. ఎల్ఈడీ టీవీల్లో కూడా ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల గురించి అవగాహన కలిగించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, కలెక్టర్ రవి పటాన్‌శెట్టి పలు సచివాలయాల్లో శిబిరాలను సందర్శించి పర్యవేక్షించారు. ప్రజలకు అవసరమైన సేవలు అందడానికి అధికారులను ఆదేశించి చర్యలు తీసుకున్నారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, జిల్లా ప్రోగ్రాం అధికారి జగదీష్, మండల ప్రత్యేక అధికారి రోజారాణి, ఎంపీడీవో వి.వి. రవికుమార్ తదితరులు శిబిరాలను సందర్శించి పర్యవేక్షించారు. ఇవి విజయవంతంగా ముగియడం పట్ల అధికారులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాల్మజిస్ట్ పవన్ కల్యాణ్



శిబిరంలో సేవలందిస్తున్న ప్రత్యేక వైద్య నిపుణురాలు గ్రేస్ కేథరిన్

శిబిరాలు విజయవంతం..

మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతంగా ముగిశాయి. 8 వేల మందికి పైబడి వైద్య సేవలు పొందారు. ప్రజలు ఉత్సాహంగా వైద్య, ఆరోగ్య సేవలను వినియోగించుకున్నారు.

-ఎస్. తిరుపతిరావు, యు. రమేష్, వైద్యులు, కశింకోట, తాళ్లపాలెం పీహెచ్‌సీలు

జగనే మళ్లీ సీఎం కావాలి



రేబాకలో ఆర్‌బీకే కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



కాపుశెట్టివానిపాలెంలో నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

- రేబాకలో ఆర్‌బీకే, కాపుశెట్టివానిపాలెంలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : నియోజకవర్గంలో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, చాలావరకూ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని రేబాకలో రూ.21.80 లక్షలతో అభివృద్ధి చేసిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.12 లక్షలతో అభివృద్ధి చేసిన కాపుశెట్టివానిపాలెం అంగన్‌వాడీ కేంద్ర నూతన భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ అభివృద్ధి, సంక్షేమంతో పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకునే భాద్యత మన అందరిపై ఉందన్నారు. పట్టణ పరిధిలో సుమారు రూ.13 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. మండలంలో శీరంశెట్టివానిపాలెం, గొలగాం, మారేడుపూడి, కోడూరు, రాజుపాలెం తదితర గ్రామాల రహదారులను జాతీయ రహదారులకు అనుసంధానం చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, గ్రామ సర్పంచ్ ఎం.సన్యాసమ్మ, ఎంపీడీవో కె.నరసింహారావు, ఈవోఆర్డీ ధర్మారావు, పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాలరావు, ఏసీడీపీవో శశికళ, ఎంపీటీసీ మంత్రి సంతోషం, వైఎస్సార్‌సీపీ నాయకులు బంటు ఏడుకొండలు, మంత్రి సత్తిబాబు, పసుపులేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



గ్యారేజీ గేటు వద్ద నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అనకాపల్లిటౌన్ : కావలి ఆర్టీసీ డ్రైవర్‌పై జరిగిన దాడికి నిరసనగా స్థానిక ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) గ్యారేజీ గేటు వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్, ఏపీపీటీడీ, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఆదివారం ఆర్టీసీ కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్‌తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న ప్యాసింజర్లపై 14 మంది దాడికి పాల్పడిన ఘటన ఘోరమైందని అభివర్ణించారు. ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నినదించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు బిక్కుబాబు, జిల్లా కార్యదర్శి డీఎస్ మూర్తి, డిపో సహాయ కార్యదర్శి వైవీఎస్ కుమార్, పీఎస్‌పీపీ రావు, ఏవీఎస్ రాజు పాల్గొన్నారు.

18న హలో మాదిగ.. చలో హైదరాబాద్



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కట్టమూరి మంగరాజు తదితరులు

అనకాపల్లిటౌన్ : హలో మాదిగ.. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నవంబర్ 18వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కట్టమూరి మంగరాజు తెలిపారు. గవరపాలెం అరుంధతీనగర్ సంఘం కార్యాలయంలో ఆదివారం చలో హైదరాబాద్ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్యకర్త చలో హైదరాబాద్ కార్యక్రమానికి బయలుదేరాలని ఆయన కోరారు. ఎస్సీ వర్గీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సభకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా విచ్చేయచున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెట్ల నాయుడు, కొల్లి చిన్నఅప్పారావు, చేవ్వేటి అప్పారావు, పరదేశినాయుడు, ఈశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పయనమైన జిల్లా బీజేపీ నేతలు



ర్యాలీలో మాట్లాడుతున్న ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

అనకాపల్లిటౌన్ : నా భూమి నాదేశం మూడో విడత కార్యక్రమంలో భాగంగా జిల్లా బీజేపీ నేతలు ఢిల్లీకి ఆదివారం పయనమయ్యారు. స్థానిక రైల్వేస్టేషన్ బయట ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ పార్టీ ఆదేశాల మేరకు 31 మండలాల నుంచి సేకరించిన మట్టి కలశాలతో ఢిల్లీకి చేరుకుంటామన్నారు. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ద్వారా విజయవాడ చేరుకుని అక్కడి నుంచి పార్టీ ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలు ద్వారా ఢిల్లీకి చేరుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గండి వెంకట సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి కర్రి రామకృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగం నిరుపమానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న క్రైం ఎస్‌ఐ సింహాచలం

అనకాపల్లిటౌన్ : స్థానిక నెహ్రూచౌక్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణ క్రైం ఎస్‌ఐ సింహాచలం మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసుల సేవలను కొనియాడారు. వారి త్యాగాలను స్మరిస్తూ ప్రతి ఏటా అక్టోబర్ 21 నుంచి వారం రోజుల పాటు పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా పేర్కొన్నారు. అంతకు ముందు పోలీస్ బ్యాండ్ పార్టీ బృందం దేశభక్తి పాటలు, వీనులవిందైన సంగీతాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ధర్మప్రచార వారోత్సవాలు



వారోత్సవాల ముగింపు సభలో మాట్లాడుతున్న కొణతాల మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్ : ధర్మప్రచార వారోత్సవాలు ఆదివారంతో ముగిసాయని నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. అమ్మవారి ఆలయ ఆవరణలో వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఈనెల 22న ప్రారంభమైన వారోత్సవాలు వారం రోజుల నేత్రపర్వంగా జరిగాయని చెప్పారు. ఈ వారం రోజులు శ్రీ మరిడి మహాలక్ష్మి భజన బృందంచే బైలో భజన, అమృత వర్షిణి బృందంచే కోలాటం, శ్రీగౌరీలలితా ప్రార్థనా మండలిచే పారాయణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నేత్రపర్వంగా జరిగాయన్నారు. వారోత్సవాలకు సహకరించిన పలు భక్తి బృందాలకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బండారు ప్రసాద్, ధర్మకర్తలు, పలు బృందాల సభ్యులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలు

అనకాపల్లిటౌన్ : అమరజీవి పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై ఈనెల 31వ తేదీ వరకూ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకుడు పిరట్ల నరసింహమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరజీవి జీవిత చరిత్రపై క్లుప్తంగా ఎ-4 సైజ్ పేపరుపై రెండు పేజీలు రాసిన విద్యార్థులను ఎంపిక చేసి ప్రథమ బహుమతిగా రూ.116, ద్వితీయ, తృతీయ బహుమతులుగా కానుకలు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మెగా వైద్య శిబిరానికి చక్కటి స్పందన



కశింకోట కస్పావీధిలో ఉచిత మెగా శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



శిబిరంలో వినికిడి పరీక్షల నిర్వహణ



విశాఖకు చెందిన సిరి డ్యాన్స్ అకాడమీ బృందం బాలికల భరత నాట్య ప్రదర్శన

కశింకోట : కశింకోటలోని కస్పావీధి రామాలయంలో ఆదరణ సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య, కంటి శిబిరాలు నిర్వహించి సుమారు 150 మందికి సేవలందించారు. ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత కంటి పరీక్షలు, వినికిడి పరీక్షలు, గుండె, గైనిక్ సమస్యలు, సాధారణ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. విశాఖ నుంచి హియరింగ్ సొల్యూషన్స్, మెడికవర్ ఆస్పత్రుల నుంచి సిబ్బంది వచ్చి సేవలందించారు. ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిరుపేదలకు చెందిన ఐదు కుటుంబాలకు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. అనాథ పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులు అందజేశారు. విశాఖకు చెందిన సిరి డ్యాన్స్ అకాడమీ బాలికల బృందం భరతనాట్యం ప్రదర్శించారు. ఇది ఆహూతులను విశేషంగా అలరించింది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పిల్లా దేవుళ్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, ఫౌండేషన్ సభ్యులు ఉజ్జి వీరేంద్ర, జనపరెడ్డి భాస్కర్, ఎర్నిబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా ఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



ఉమా కోటిలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న కొణతాల మురళీకృష్ణ



స్వామి వారి సన్నిధిలో భక్తులు

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెంలో ఆదివారం ఉమా కోటి లింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కార్యదర్శి, ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, అనకాపల్లి నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఎంపీపీ కలగా లక్ష్మి, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, మండల వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి జాజుల రమేష్, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, బయ్యవరం సర్పంచ్ గొల్లవిల్లి జయ, కన్నూరుపాలెం సర్పంచ్ ఎస్. శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు అద్దెపల్లి శ్రీనివాసరావు, గొంతిన శివ ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దుశ్శాలువలు కప్పి జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు సత్కరించారు. పెద్ద సంఖ్యలో స్థానికులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. బంగారయ్యపేటకు చెందిన బృందం భజన కార్యక్రమం నిర్వహించింది. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

గ్రంథాలయంలో.. 'చదవడం మాకిష్టం'

గొలుగొండ: చదవడం మా కిష్టం కార్యక్రమాన్ని స్థానిక గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి రాజుబాబు ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న విద్యార్థులు పాల్గొని, తమకు ఇష్టమైన పుస్తకాలను చేతపట్టారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పిల్లలకు గ్రంథాలయాల ప్రాముఖ్యత తెలుస్తుందన్నారు.

క్రీడాకారుల్ని ప్రోత్సహిస్తున్న సర్పంచ్‌కు సత్కారం



సర్పంచ్ అప్పారావును సత్కరిస్తున్న స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ శ్రీనివాసరావు, క్రీడాకారులు

చోడవరం: గ్రామీణ క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకు గాంధీగ్రామం సర్పంచ్ గాడి అప్పారావు చేస్తున్న కృషి ప్రశంసనీయమని రాష్ట్ర స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ జొన్నాడ శ్రీనివాసరావు అన్నారు. చోడవరం కాలేజీ గ్రౌండ్‌లో గ్రామీణ క్రీడాకారుల కోసం ఏర్పాటుచేసిన బాల్‌బాడ్మింటన్ కోర్టుల అభివృద్ధికి సర్పంచ్ అప్పారావు తన వంతు సహకారం అందించారు. దీనికి క్రీడాకారులంతా కృతజ్ఞతగా ఆదివారం ఆయన్ని సత్కరించారు. ఈ సందర్భంగా జొన్నాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంలో గత ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం వహించాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని విధాలుగా క్రీడలకు ప్రోత్సాహం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ సమావేశం

నర్సీపట్నం: విశ్వబ్రాహ్మణ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం నర్సీపట్నం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ ద్వారా భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించుకున్నారు. యూనియన్ బలోపేతానికి కలసికట్టుగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు. కార్తీకమాసం పురస్కరించుకుని యూనియన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 10న కోటవురట్ల మండలం, పాములవాక పట్టాలమ్మ తల్లి ఆలయం వద్ద వనసమారాధన ఏర్పాటు చేసేందుకు తీర్మానించామన్నారు. యూనియన్‌కు తగు సూచనలు, సహాలు ఇస్తూ ముందుకు నడిపిస్తున్న సంఘ సీనియర్ సభ్యుడు వెదురువాడ రామగణేశ్వరరావును యూనియన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.